
# కెరటం



"మల్లి"

గది చీకటిగా ఉంది. పెట్టెలో వున్న చిట్ట చివరి సిగరెట్టు కూడఐపోయింది. కృష్ణమూర్తికి చిరాకేసింది. . . జానకి ఈమధ్య ఎందుకో చాలా దిగులుగా వుంటోంది. . . కారణం అనూహ్యంగా ఉంది. దగ్గరగావున్న ఒక్క కిళ్లీషాపుకూడ మూసేసివుంటారు. . ఇక సిగరెట్లు దొరకవు.

"ఇక్కడ వున్నావా చీకట్లో!! డాబామీద పడుకున్నావనుకున్నానూ!" అమ్మ కంఠం!

అమ్మ ప్రేమస్పర్శతో గది వెలుగు నింపుకుంది. జానకి సహచర్యంతో తన జీవితం కూడ వెలుగు నింపుకుంటుందని ఆశ పడ్డాడు! జానకి చాలా మారిపోయింది...కృష్ణమూర్తి గదిలో లైటు ఆర్పి డాబా మీదకుపోయి పడుకున్నాడు. . . నీలినీలి ఆకాశంలో నిశ్చలంగా మెరుస్తూ కవ్విస్తున్నాయి తారలు! !

మూడున్నర్రోజుల క్రిందట జానకి తనను అడిగింది, "ఒక్క నెలరోజులు మావూరు వెళ్లి రావాలని వుంది! ఏమంటారు ?" అని! కృష్ణమూర్తి గతుక్కుమన్నాడు! ముప్పై రోజులు!! పెళ్ళయినతర్వాత జానకిని వదిలి అతను మూడు రోజులైనా వుండలేదు. . జానకీ తనని విడిచి అన్ని రోజులు వుండగలదని అతను అనుకోనూ లేదు..!

అతను జానకి కళ్ళలోకి సూటిగా చూశాడు. చిలిపితనం చిందులాడే ఆకళ్ళు అప్పుడు దైన్యం నింపుకుని ఆతృతగా చూస్తున్నాయి.

"నీయిష్టం జానకీ! నీ కోరిక ఎప్పుడు తోసి పుచ్చాను కనుక!" అన్నాడు. . . జానకి మెల్లిగా ఏదో అన్నది. . తను వినదల్చుకోలేదు. వినాలనిపించలేదు. నాలుగేళ్ళక్రిందట ఆమె పంపిన తన ఫోటో టేబిల్‌మీద ఉంది. . దానికేసి చూస్తూ ఉండిపోయాడు! !

తరువాత అరగంటకి జానకి బట్టలు సర్దుకుంటూ ఉండటం చూశాడు. . . ఆవిడకివున్న చీరెలన్నీ తీసుకుని వెళ్తోంది. కృష్ణమూర్తికి ఆశ్చర్యం కలిగింది. . తమాయించుకున్నాడు. . . ఆవిడకి పుట్టిల్లే బాగుంటే వెళ్ళనీ!!" అనిపించింది. అదేభావంతో ఆమెను ట్రైన్‌లోఎక్కించి వచ్చాడు!! జానకి మౌనంగా కూర్చుంది రైలు కదిలేవరకూ. అతనికి దిగులైంది. . నాలుగైదు నెలల నుంచీ జానకి నిర్లిప్తంగా ఏదో చేజార్చుకున్నదానిమల్లె వుండటం తను గమనించి చాలా బాధపడ్డాడు! అతనికి జానకిపైన జాలి కలిగింది. . . తనకోసం ఆవిడ ఎన్నెన్నో నష్టపోయిం'దని జ్ఞాపక మొచ్చినప్పుడల్లా అతనికి జాలి కలుగుతుంది. . .

అందువల్లనే అతను జానకిని గౌరవిస్తాడు. ఏదో తప్పుచేసినవాడిమల్లె బాధపడతాడు! కృష్ణమూర్తికి వెన్నులో ఎవరో పొడిచినట్లైంది. . గతకాలమనే గనిని త్రవ్వుకుంటున్నాడతను!! బంగారు జ్ఞాపకాలు దొరికాయి.

ఐదు సంవత్సరాలక్రిందట. . . .

ఇంటర్మీడియట్ నాలుగవసారి తప్పాడు తను.. "వీడికి చదువురాదు" అన్నాడు నాన్న!

"నీకోసం ఎంత కష్టపడుతున్నానో ఆలోచించు కృష్ణా! బాగా చదవకపోతే ఎలాగ బాబూ!" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది అమ్మ!

వీడిని ఏదైనా ఉద్యోగంలో పెట్టడం నయం! రేపు ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో పేరు వేయించటం మంచిది" అన్నాడు అన్నయ్య!

"అల్లరి చిల్లరగాతిరిగితే చదువెలా వస్తుందేం వీడిరాతింతే!!" అనాది అక్కయ్య. "బావ కింక

పదేళ్ళకిగానీ ఇంటర్ ప్యాసయ్యే అదృష్టంలేదు'' అన్నది మామయ్య కూతురు విష్ణుప్రియ. . .

దిండులో తలదాచుకుని ఆడపిల్లలా ఏడ్చి పోయేవరకూ విలపించాడు కృష్ణమూర్తి. తన చుట్టూవున్న ప్రపంచమంతా తనని హేళన చేస్తున్నట్లు,వెక్కిరించినట్లు అనిపించింది! కసి కూడ రేగింది వాళ్ళమీద! ఇల్లాగే డాబామీద పడు కుని నక్షత్రాలు చూస్తూ ఎన్నో కలలు కనేవాడు అరోజుల్లో. ఇంటరు అన్నిసార్లు తప్పకముందు!! కోరికల కోటల్లో విహరించేవాడు! గెజెటెడ్ ఆఫీసరయ్యేవాడు!! ఏదో సంస్థకి మేనేజరయ్యే వాడు!! ఫారిన్ వెళ్లేవాడు!

కానీ కృష్ణమూర్తి నాలుగుసార్లు తప్పాడు. అతని కలలన్నీ కరగిపోయాయి. . . తనెందుకూ పనికిరాడనిపించింది. . . అల్లాగని అందరూ అన్నారుకూడ. . ఉద్యోగం చూసుకోమని ఇంట్లో పోరు ఎక్కువైంది. . . తనకి యింకా చదవాలని కోరిక. . . డబ్బులేదు!! కృష్ణమూర్తికి చచ్చిపోదా మనిపించింది. అటువంటి సమయంలో జానకి వచ్చింది. . జానకి తనకు బంధువుకాదు. . .క్లాసు మేటు కాదు.

పట్నంలోకల్లా బాగా డబ్బున్నవాడని పేరు బడిన పరంధామయ్యగారి కూతురు జానకి! ఆసంవ త్సరమే ఇంటర్ ప్యాసయింది. బి. ఏ.లో చేరింది.

ఆ అమ్మాయి తనను చూసింది. . ఒక్క క్షణంసేపు రెప్పవాల్చకుండా చూసింది. . .

''ఈ పరీక్షలన్నీ జీవితగతిని మార్చలేవు కృష్ణ మూర్తీ!! జీవితంలో అనేక పరీక్షలు ఎదురవు తవి!! వాటిని జాగ్రత్తగా దాటాలి!! లోకపుతీరు గమనించు. కేవలం చాలా డబ్బుగలవాడివి కావాలని కలలు కనటం అవివేకం. . . డబ్బుకన్న విలువైన వస్తువులు ఇంకా చాలా వున్నాయి'' అన్నది. . .

తనకా పరిస్థితులలో ఏమీ అర్థంకాలేదు. . . పెద్ద ఉద్యోగస్థుడని అక్క భర్తని ఇంట్లో అందరూ చాలా గౌరవిస్తారు.!! డబ్బున్నవాడని మామయ్యని గౌరవిస్తారు. . అన్నయ్యనీ అంతే!! ఇంక డబ్బుకన్న విలువైనది ఏముంటుంది ? అదే అన్నాడు జానకితో.

జానకి నవ్వింది. . .

''మన కిటికీలోనుంచీ కనపడే వెలుగుకన్న బయట ఎంతో వెలుగు వుంది''అని ఒక సామెత చదివాను ఎక్కడో!! కళ్ళు విప్పి ప్రపంచాన్ని చూడు. . '' అన్నది. —

జానకి పుస్తకాలు ఎక్కువగా చదివేది. . . క్లాసు పుస్తకాలకన్నా నవలలూ, అవీ ఎక్కువగా చదివేది. . చాలా సామాన్యంగా అలంకరించు కునేది. . . ఎక్కువసేపు తమ బాల్కనీలో మాలతీ లత ప్రక్కన కుర్చీ వేసుకుని కూర్చునేది. . .

కృష్ణమూర్తి మూర్తీభవించిన శాంతిదేవతలా వున్న జానకిని గౌరవించాడు. తరచు వాళ్ళఇంటికి వెళ్లేవాడు. జానకి ఏవేవో చెప్పేది. ఎక్కువగా తత్వబోధ చేసేది.

''ఇంత చిన్నతనంలో ఏమిటో ఈవిడకీ పిచ్చి'' అనుకునేవాడతను.

''జానకి కథలు వ్రాస్తుందని'' చెప్పారు ఎవరో.

''అదృష్టవంతుడు ఈమె కాబోయే భర్త'' అనుకునేవాడు తను.

ఆ సెప్టెంబరులో తనూ ప్యాసయ్యాడు.

ఈసారి అందరూ నిర్లిప్తంగా వుండిపో యారు. అతను పరీక్షలో నెగ్గాడన్న ఆనందం ఎవరినీ కదిలించలేకపోయింది.

కృష్ణమూర్తి మనసు బి. ఏ. వైపు లాగింది. అతను మళ్ళీ కాలేజీ జీవితాన్ని గురించి కలలు కనటం ప్రారంభించాడు.

అమ్మ తన కోరిక మన్నించింది.

అన్నయ్యని బ్రతిమిలాడి అతనిదగ్గర వుంచింది చదువుకి.

కృష్ణమూర్తి ఈ సారి బాగా చదివాడు.

బి. ఏ. లో అతనికి బాగా మార్కులొచ్చాయి. ''ఎల్లాయినా మావాడిది గట్టిబుర్రే సుమండీ! అప్పుడు శనిరోజులు కాబట్టి అన్నిసార్లు పరీక్ష పోయిందిగానీ ....'' అన్నాడు నాన్న.

''నాకు తెలుసు, వాడు తెలివిగలవాడని'' అన్నది అమ్మ.

''నా యింట్లో వుండబట్టి ప్యాసయ్యాడు'' అన్నాడు అన్నయ్య.

''బుద్ధిమంతుడు కృష్ణ ! వాడి తెలివిమీద నాకు చాలా నమ్మకం'' అన్నది అక్కయ్య.

''బావ ఇంటలిజంట్ ఫెలో '' అంది మామ య్య కూతురు విష్ణుప్రియ.

అతను జానకికి చెప్పాడు ఈ విషయాలు. జానకి నవ్వేస్తూ, ''తెలివితేటల్ని పరీక్షలలోవచ్చే మార్కులతో తూస్తారు చాలామంది''అంది ...

ఆ పైన అతనికి చదువుకునే అవకాశాలు లేకపోయాయి.

ఉద్యోగాల వేట ప్రారంభమయింది. అదేమిటో ఉద్యోగం తేలికగానే దొరికింది. బంధుజనానికి అతన్నీ, అతని అదృష్టాన్నీ తెలివినీ పొగిడేందుకు మరికొన్ని అవకాశాలు !

పెళ్ళికూతుళ్ళ వేట.

''మా వాడికి మూడువేలన్నా యివ్వాలి''అన్నాడు నాన్న.

పిల్లకి ఓ వెయ్యిరూపాయలు విలువచేసే సొమ్మయినా పెట్టాలి''అంటుంది అమ్మ.

''అందంగావుండి, చెప్పినట్లల్లా వినేపిల్ల బాగు టుంది'' అని అక్కయ్య వుద్దేశ్యం.

ఒక్కొక్కప్పుడు జీవితములో చిత్రాతి చిత్ర మయిన సంఘటనలు జరుగుతాయి. అవి జరిగాక కూడా ''ఇవి నిజంగా జరిగాయా, లేక కలా !'' అని ఆశ్చర్యపడుతూ వుంటాం. అల్లాంటి సంఘటన ఒకటిజరిగింది. కృష్ణమూర్తి జీవితాన్నితారుమారు చేసింది. ... ఒక్క రెండుగంటలవేళ పరంధా మయ్యగారి తమ్ముడు తమ యింటికి వచ్చాడు.

అతను తెచ్చిన సందేశం తాలూకు సారాంశం ఇది! జానకి ... జానకి తనను తప్ప మరెవ్వరినీ పెళ్ళాడనని పట్టుపట్టిందట. అందువల్ల నాన్నను వచ్చి తాంబూలాలు పుచ్చుకోవాలని.

పరంధామయ్యగార్ని గురించి తమ కుటుంబంలో అందరికీ బాగా తెలుసు. ఆయనకు ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువ. తాను చెప్పినట్లు యితరులు నడు వాలనుకునే స్వభావమేకానీ తా నెన్నడూ ఓడి పోడు.ఆయన ఈసంబంధానికి యిష్టపడివుండడు. ఉద్యోగం తప్ప మరేమీలేనివాడికి పిల్లనిచ్చేందుకు ఏ ధనవంతుడి మనసొప్పుతుంది ?

ఇదంతా జానకిపట్టుదలే అయివుండాలి. జానకి తనపట్ల అనురాగం వుందని ఎన్నడూ వూహించలేదు తను.

అమ్మకీ, నాన్నకీ, అక్కయ్యకీ ఎవరికీ జానకి మీద సదభిప్రాయం లేదు. అవిడ బాగుండదని అంటారు. జానకి అందగత్తెకానిమాట వాస్తవమే. కానీ జానకిలో ఆకర్షణ వుంది. ఆవిడ మాటలు ఎల్లాంటివారినైనా అట్టే కట్టేస్తాయి.

జానకిమీద కృష్ణమూర్తికి గౌరవభావమూ, అనురాగమూ కూడా వున్నాయి.

కాలికి తగులుతోంది రత్నం. అది చేతికి తీసు కోనివాడు మూర్ఖుడు కదూ !

''వూఁఅను నాన్నా! నేను జానకినే చేసుకుం టాను !'' అన్నాడు తను.

''ఆయన నీకు కట్నమివ్వడు. పై పెచ్చు. మనమంటే ఆయనకు గౌరవముండదు. వద్దని చెప్పు'' అంటాడు నాన్న !

''ఆ అమ్మాయి అంత చదువుకున్నది, కథలవీ రాస్తుందిట! మనమాట వింటుందా, పనిపాటలూ చేస్తుందా''! అంటుంది అమ్మ.

కృష్ణమూర్తికి మనసులో ద్వంద్వయుద్ధం జరిగింది. చివరికి జానకే గెలిచింది.

పెళ్ళిలో చిత్రమయిన సంఘటనలు కాక పోయినా, కొన్ని జరిగాయి అలాంటివే. అమ్మకీ, నాన్నకీ, తనమీద విపరీతమయిన కోపం వచ్చింది. కృష్ణమూర్తి వాటిని లెక్కపెట్టలేదు. లెక్క చెయ్యదలచలేదు. ... జానకి తనదయింది. తన జీవితాన్ని చైతన్యవంతం చేసింది.

తను స్వర్గంలో విహరించాడు. ... మధు పానంలాగా మత్తుగా దొర్లాయి రోజులు. సౌం దర్య భరితమయిన రోజులవి.

జానకికీ, అమ్మకీ అప్పుడప్పుడూ చిన్న చిన్న మాట్లాటలు జరిగేవి.

దరిమిలా కొన్నాళ్ళనుంచి జానకి తనని మీరు అంటోంది. అదివరకులా నవ్వుతూ, చిలిపిగా మాట్లాడటం లేదు. మర్యాదస్తురాలి వలే, ఒకచోట కూర్చుంటోంది. తనని విపరీతంగా గౌరవిస్తోంది.

నాన్నకి పొద్దస్తమానం పరంధామయ్యని ఆడి పోసుకోకపోవడం హాబీ.

అప్పుడప్పుడూ అమ్మకూ అదే సైడ్ హాబీ.

అవి విన్న రోజున జానకి దిగులుగా వుండటం తాను గమనించేవాడు.

అతనికి యిల్లాంటివాటిలో జోక్యం కల్పించుకోవటం ఇష్టం వుండదు.

ఆఫీసునుంచీ ఆలస్యంగా వచ్చిన రోజున అలుక వహించే జానకి ప్రస్తుతం నిర్లిప్తంగా ఉంటోంది. ''ఆలస్యం ఎందుకయింది ?'' అనయినా అడుగదు. పుస్తకాలూ చదవదు. ఎక్కువ మాట్లాడదు. ఆ నిర్లిప్త తను భరించలేడు.

తను యిద్దరినీ దూరం చేస్తోంది ఆమె తన కిస్తున్న గౌరవం.

ఆ గౌరవాన్ని తను భరించలేక పోతున్నాడు. ఒకరోజున జానకిని కసిరాడు తను.

''ఎన్నిసార్లు చెప్పాను, 'మీరు' అనవద్దని .. నా మాట వినటం నీ కిష్టంలేదూ' అని, జానకికి కళ్ళంట నీళ్ళు తిరుగుతుండగా.

''మీ వంశంలో ఎవరూ భర్తను నువ్వు అని అనరుట ! అణుకువలేని ఆడది బ్రతికి ఎందుకు ? నన్ను మీరు అననివ్వండి. '' అంది.

అమ్మనీ తను ఏమీ అనలేడు.

అమ్మ తన జీవితాన్నినిలబెట్టింది.

ఈ పోరాటంలో కృష్ణమూర్తి బాగా అలసిపోయాడు. అతను ఆఫీసునుంచీ ఆలస్యంగా రావటం సాగించాడు.

అతనికనిపించింది, తను జానకిని చేసుకుని ఉండకూడదని.

ఆమెకి తనదగ్గర సుఖంలేదు. . . మరో ధనవంతుల యింట్లో సకల వైభోగాలతో, గౌరవంతో తులతూగవలసిన జానకిని తను ఎందుకని చేసుకున్నాడు ? ఆమె బ్రతుకు పాడు చేశాడుతను!

పెద్దవాళ్ళు ఏదో అంటూ వుంటారు. జానకి అటువంటివాటికి బేలయిపోవాలా ? కాదు. తనని చేసుకున్నందుకు జానకి, యిప్పుడు పశ్చాత్తాపపడుతూ వుండాలి! అదే నిజమైతే, తను జానకికి ఎలా సహాయం చెయ్యగలడు ?

అమ్మ దగ్గుతోంది తెరలు తెరలుగా! కృష్ణమూర్తి చేతిగడియారం చూసుకున్నాడు—ఒకటిన్నర! నిద్రరావటం లేదు. . .జానకికి దిగులుగా వుంటోంది. జానకి మంచిది. జానకి తనని ప్రేమిస్తోంది. జానకి తనను చేసుకున్నందుకు ఎప్పుడూ విచారించదు! మరెందుకు జానకికి దిగులు ?

సిగరెట్లు లేవు కాల్చేందుకు. . .జానకి లేదు. కనీసం చూసేందుకైనా. . .నీలి నీలి ఆకాశంలో నిశ్చలంగా మెరుస్తూ కన్పిస్తున్నాయి తారలు!! కృష్ణమూర్తి బలవంతంగాకళ్ళుమూసుకున్నాడు! కల్లోనైనా జానకి కనిపిస్తే బాగుండును!

మాలతీలత ప్రక్కన కుర్చీవేసుకుని కూర్చుని తన జీవితాన్ని సింహావలోకనం చేసుకుంది జానకి.

''జీవితంలో ఏమీ ఆశించకూడదు'' అనిపించిందామెకి!

పునాదులులేని ఓటిగోడలతో కోటలు కట్టుకుని కూల్చుకుంటారు చాలామంది ! కృష్ణమూర్తిని మొదట్లో తను పసిపాపగా భావించి జాలిపడింది. అతను పరీక్ష తప్పిన రోజాలలో అతనిని ఎంతోమంది హీనంగా చూశారు! తనకతనిమీద జాలివేసింది.... సరైన పోషణలేక ఎదగని మొక్కలా అనురాగ వర్షంలేక బీటలు వారిందనుకుంది అతని హృదయం! అందుకే అతన్ని చూసి జాలిపడింది.

అతని జీవితాన్ని చైతన్యవంతం చెయ్యటమే తన ఆశయమనుకుంది. . .ప్రపంచంలో అందరిచేత. . . చాలామందిచేత ఆరాధింపబడుతున్న అర్థబలాన్ని అరికాలితో తన్నేసింది! అతను తన పసిపాప! అతన్ని తను కనుపాపలా సాకాలి! ఎవరైతే అతనిని హీనంగా చూశారో. . వాళ్ళే అతన్ని గౌరవించాలి! అదే తన ఆశయం! అతడిలోని విలువ బయటికి తేవాలి! కొన్నాళ్ళ తను, తన కలలురూపు ధరించాయని నమ్మింది! సంప్రదాయాలూ, లాంఛనాలూ, గౌరవాలూ, మర్యాదలూ వంశాచారాలు ఆమెని పసిపాపకి దూరం చేశాయి. ఆ పాపస్థానంలో తనకున్న పెద్దవాడూ, తనని భరించేవాడూ అయిన కృష్ణమూర్తి వున్నాడు యిప్పుడు! తన కృష్ణ కాదు. అతడిని తను గౌరవించాలి. . .పూజించాలి అంతే. . . .

యీ పరిణామం తనకెందుకో విషాదంగా వుంది!! తనకీ అత్తగారి మీద గౌరవభావం ఉంది. ఆవిడ మీద అనురాగం వుంది. అందుకే, ఆవిడకీ తనకొడుకుని తన కోడలు గౌరవించాలనే కోరిక వుంటుందని తను అర్థంచేసుకున్నది. . .

ఆవిడ మనస్సు తనెందుకు కష్టపెట్టాలి ? వాళ్ళు తన తండ్రిని గురించి కటుపుగామాట్లాడినప్పుడు తనకి దిగులుగా వుండేది. . .

ఒక్కొక్కసారి ఆవేశం వచ్చేది. కానీ తను కావాలని వారిలో జొరబడినప్పుడు ఏమనగలదు వారిని. . . తనకి కావాలసనది కృష్ణ! మిగతా వస్తువులన్నీ తన దృష్టిలో ఇసుక రేణువులు!

మాలతీలత పరిమళం వెదజల్లుతోంది. జీవితమూ ఒక కొన్నిరోజాలు అంతే. . .తను వచ్చి నాలుగు రోజులైంది...నెల రోజులు వుండామని వచ్చింది. . .దిగులుగా వుంది. . .

ఎలావున్నాడో తనకృష్ణ! అమ్మకోసం బెంగపెట్టుకున్న పాపలా! ఊహూఁ కాదు! అతనీమధ్య తననిసరిగా అర్థంచేసుకోటంలేదు తనని!

దానికి కారణం కూడా తనేనేమో!

తనేగా అతనిని దూరం చేసుకుంటోంది.

ఎల్లావున్నాడో అతను ? ?

వెళ్ళిపోతే!!

అవును వెళ్ళిపోతే!!!

అవివేకంగానీ, తనకి ఇక్కడ దొరుకుతుందా మనశ్శాంతి ?

మాలతీలత దగ్గర్నుంచీ వచ్చి గబగబ బట్టలు సర్దుకుంటోంది జానకి!

''అదేమిటే'' అంది అమ్మ!

''నా పాప బెంగపెట్టుకుంటాడమ్మా! వెళ్ళాలి!!'' అనేసి వూరుకుంది జానకి మనువంగా.



వేణుగోపాలస్వామి దేవాలయము..............జి. వి. సత్యం